క్లుప్తంగా

మంత్రి కేటీఆర్‌కు గ్రామస్తుల వినతి

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంతో పాటు వెంకంపల్లి గ్రామ పంచాయతీలను గంగాధర మండలంలోనే కొనసాగించాలని కోరుతూ రెండు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, పలువురు మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేస్తే ఉప్పరమల్యాల రెవెన్యూ గ్రామంతో పాటు గ్రామ పరిధిలోని వెంకంపల్లి గ్రామ పంచాయతీలను గంగాధర మండలంలోనే కొనసాగించాలని రెండు గ్రామాల ప్రజలు ఇటీవల ఆందోళన చేశారు. మంగళవారం రెండు గ్రామాల ప్రజలు మంత్రిని కలిశారు.

బీమా చెక్కులు అందజేత

సైదాపూర్: మండలంలోని పురుషుల పొదుపు సమితి నుంచి మంజూరైన బీమా చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం సమితి అధ్యక్షుడు పోగు రమేశ్ అందజేశారు. సైదాపూర్‌కు చెందిన కొండ రాజేశం, ఘనపూర్ గ్రామానికి చెందిన తిప్పారపు సదయ్య సైదాపూర్ పురుషుల పొదుపు సంఘంలో సభ్యులుగా కొనసాగుతుండగా పలు కారణాలతో మృతి చెందారు. ఈ మేరకు సంఘం నుంచి మంజూరైన రూ.95,783 చెక్కును రాజేశం కుమారుడు మురళికి, సదయ్య భార్య జయకు రూ.67,023 చెకుకలు అందజేశారు. కార్యక్రమంలో సైదాపూర్ పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు పైడిపల్లి రవిందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు పైడిపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఒకే అభివృద్ధి పనులపై పలుమార్లు సంబరాలు'

గన్నేరువరం: ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చౌకబారు ఎత్తుగడలు మానుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఒకే అభివృద్ధి పనులపై పలుమార్లు సంబరాలు, పాలాభిషేకాలు చేసుకోవడం ఎమ్మెల్యేకే చెల్లుతుందన్నారు. మళ్లీ శిలాఫలకాల పేరుతో మరోసారి సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్షాలు బంద్ చేపట్టడం, ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని విమర్శించారు.

గృహలక్ష్మి పథకం అందరికీ అమలుచేయాలి



మాట్లాడుతున్న నిషాని రామచంద్రం

మానకొండూర్: రాష్ట్రంలో గృహలక్ష్మి పథకాన్ని కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ లబ్ధిపొందేలా అమలు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నిరుపేదలకు ఇంటిస్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకోవడానికి మూడురోజులు గడువు పెట్టడం విడ్డూరంగా ఉందని, గడువు తేదీని పెంచాలన్నారు. కార్యక్రమంలో డి. కొమురయ్య, రాజు, అంజయ్య, ఆనంద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



టీకాలు వేస్తున్న డాక్టర్ అరవింద్

మానకొండూర్‌రూరల్: మండలంలోని ముంజంపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో పశువులకు గాలికుంటు, ముద్దచర్మ వాధుల నివారణకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆరు వందల పశువులకు టీకాలు వేసి మందులు అందజేశామని డాక్టర్ అరవింద్ తెలిపారు.

తాటిచెట్లను చంపేందుకు..



తాటిచెట్లను పరిశీలిస్తున్న ఎస్సై స్వరూప

రామడుగు: పంటపొలంలో ఉన్న తాటిచెట్లను చంపేందుకు ప్రయత్నించిన సంఘటన మండలంలోని వెలిచాల గ్రామంలో జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు బొమ్మకంటి నర్సయ్య పొలంలో ఉన్న దాదాపు పది తాటిచెట్లకు రంధ్రం చేసి విషగుళికలు వేశాడు. గమనించిన కల్లు గీతకార్మికులు సంఘం అధ్యక్షుడు దైవాల హన్మాండ్లు దృష్టికి తీసుకెళ్లి ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ శాఖ ఎస్సై స్వరూప మంగళవారం తాటిచెట్లను పరిశీలించారు. సంఘటనపైన విచారణ చేసిన అధికారులు కేసు నమోదు చేశారు.

డబుల్ రోడ్డుతో మహర్దశ

- బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి
- గుండ్లపల్లి – పొత్తూరు వరకు రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి
- రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- విమర్శలు మానుకోవాలి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



శంకుస్థాపన చేస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బాలకిషన్

గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామం వరకు రూ.71 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణంతో మండలానికి మహర్దశ కలగనుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి గుండ్లపల్లి వద్ద రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. అణిచివేతతో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ పోరాటం ఆరంభమైందన్నారు. కరువు, కాటకాలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న తెలంగాణ నేడు సస్యశ్యామలంగా అభివృద్ధిలో దూసుకపోతుందన్నారు. ఉచిత కరెంట్, ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీరు సరఫరాతో వరి ధాన్యం దిగుబడిలో దేశంలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 40 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో విద్యుత్ తీగలపై బట్టలు ఆరేయాల్సి వస్తోందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ అసెంబ్లీలో అవహేళన చేశారని, అవే తీగలతో 24 గంటలు కరెంట్ సరఫరా అవుతోందని, కాంగ్రెస్ నాయకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఏర్పాటు సమయంలో 7,700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఉండగా ప్రస్తుతం 25 వేల మెగవాట్ల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేశామని, విద్యుత్‌ను విక్రయించే స్థాయికి రాష్ట్రం ఎదిగిందని వెల్లడించారు. కాంగ్రెస్, బీజేపీ అధికారం కోసం ఆరాటపడుతున్నాయని విమర్శించారు. గన్నేరువరం మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిలో చేసిందని బీఆర్‌ఎస్ ప్రభుత్వమని, ప్రతిపక్షాలు అర్థరహిత వ్యాఖ్యలు, విమర్శలు మానుకోవాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. రోడ్డు నిర్మాణంతోపాటు గన్నేరువరం, గుండ్లపల్లిలో సెంటర్ లైటింగ్, గునుకులకొండాపూర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం వద్ద రోడ్డు విస్తరణ చేసి మరో విగ్రహం ఏర్పాటుతో ప్రత్యేక సర్కిల్ ఏర్పాటు చేస్తామని, జంగపల్లి సర్కిల్‌ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. జంగపల్లి, గన్నేరువరం చెరువు వద్ద బ్రిడ్జీలు నిర్మిస్తామని, రహదారితో వేములవాడ వెళ్లడానికి సిద్దిపేట, హైదరాబాద్ ప్రజలకు దూరభారం తగ్గనుందన్నారు. పేదలు, రైతుల సంక్షేమ కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. మండలకేంద్రం నుంచి గుండ్లపల్లి స్టేజీ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గూడెల్లి తిరుపతి, రాజన్న సిరిసిల్ల జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మండల కోఆర్డినేటర్ బద్దం తిరుపతిరెడ్డి, కాంట్రాక్టర్ కమలొద్దీన్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చొప్పదండిలో ఎగిరేది గులాబీ జెండానే

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: ఎన్నికలు ఏవైనా గెలుపు గులాబీ దండుదేనని, ముచ్చటగా మూడోసారి రాష్ట్రంలో అధికారం చేపట్టేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, ప్రతీ కార్యకర్త శ్రమించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులతో బూరుగుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సంసిద్ధం ఉండాలని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పార్టీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని, ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించాలని, గడపగడపకూ ప్రభుత్వ పథకాలు వివరించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని, అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో పండుగ వాతావరణం ఆవిష్కృతమైంది.

ముగిసిన తొలిమెట్టు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మానకొండూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొలిమెట్టు శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందిచేందుకు మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఇన్‌చార్జి విద్యాధికారి మధుసూదనాచారి మాట్లాడారు. ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో మండల నోడల్ ఆఫీసర్, జిల్లా పరిశీలకులు, రిసోర్స్ పర్సన్స్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ఇంటికే జాతీయ జెండా



జాతీయ జెండాలతో పోస్టల్ శాఖ సిబ్బంది

రామడుగు: పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ఇంటి వద్దకే జాతీయ జెండా కార్యక్రమం ప్రారంభించామని రామడుగు పోస్ట్‌మాస్టర్ అజ్మత్ అలీ తెలిపారు. గతేడాది హర్ ఘర్ తిరంగాకు మంచి స్పందన వచ్చిందని, మళ్లీ ఈఏడాది హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టామన్నారు. ఈనెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.25 చెల్లిస్తే పోస్టల్‌శాఖ సిబ్బంది ఇంటివద్దకే వచ్చి జాతీయ జెండాను అందిస్తారని పేర్కొన్నారు. మంగళవారం ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది సుధాకర్, అనిల్, శ్రీనివాస్, వెంకటేష్, సాయి, అజయ్, సంజయ్ పలువురు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో...

హుజూరాబాద్: స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను జెండాను ఎగరేసి దేశభక్తిని చాటాలని ఏసీపీ జీవన్ రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని తపాలా కార్యాలయంలో అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రతి పోస్టాఫీసులో జాతీయ జెండాను రూ.25లకు విక్రయిస్తున్నారని అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రమేష్, హుజూరాబాద్ పోస్ట్ మాస్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు నివాళి



కాగడాలతో ప్రజా సంఘాల నాయకులు ర్యాలీ

జమ్మికుంట: పట్టణంలో ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళి అర్పించారు. గాంధీచౌక్ నుంచి పురవీధుల గుండా కాగడాలతో ర్యాలీ నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తన పాటలతో అణగారిన ప్రజల జీవన విధానం సమాజానికి తెలియజేసి, ప్రజల్లో చైతన్యం కల్పించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. గద్దర్, ప్రజాపాత్రికేయుడు జహీరొద్దీన్ అలీఖాన్‌కు జోహార్లు అర్పించారు. ప్రజాస్వామిక, కార్మిక, కర్షక సంఘాలు, ఉద్యోగులు, మేధావులు, పౌరహక్కుల సంఘాలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

జహీరొద్దీన్ అలీఖాన్‌కు..

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ సమీపంలో భారత్ బచావో రాష్ట్ర చైర్మన్, సియాసత్ ఉర్దూ పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరొద్దీన్ అలీ ఖాన్ మృతికి సంతాప సూచికగా మంగళవారం ప్రజా సంఘాల నాయకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాడిశెట్టి వెంకట్రాజం, సంధ్యల వెంకన్న, సత్తన్న, చందుపట్ల జనార్దన్, వేల్పుల రత్నం, కుమారస్వామి, శేఖర్, సురేందర్,రాంరాజేశ్, శ్రీనివాస్, కొలిపాక సారయ్య, దాట్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంపద వనం పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీలత

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో సంపదవనాన్ని మంగళవారం డీఆర్‌డీవో శ్రీలత పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పెంచుతున్న నర్సరీని సందర్శించి అధికారులకు మొక్కలు నాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దీన్, ఏపీవో శారద, సర్పంచ్ సుజాత, ఏఈ తిరుపతి, జేఈ అంజయ్య, సమ్మ రాజేశ్వర్‌లున్నారు.

ఎస్‌ఐ కొలువు సాధించిన మానసకు సన్మానం



సన్మానిస్తున్న కరస్పాండెంట్ వీరరాజు

జమ్మికుంట: పట్టణంలోని గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాల పూర్వ విద్యార్థిని మౌటం మానస ఎస్‌ఐ కొలువు సాధించిన సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ముష్క వీరరాజు, అధ్యాపకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఓదెల మండలం శానగొండ గ్రామానికి చెందిన మానస 2019–22లో డిగ్రీ చదివిందని, ఎస్‌ఐగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మానసకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరీశ్, అంజిబాబు, తహేరా బేగం, చంద్రయ్య, సాగర్, భాస్కర్, కరుణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

రాంపూర్ యువకుడు..

హుజూరాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్సై ఫలితాల్లో మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన వేముల లక్ష్మణ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. లక్ష్మణ్ తండ్రి సంవత్సరం క్రితమే మృతి చెందగా, తల్లి అరుణ వ్యవసాయ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఎస్సై ఉద్యోగానికి లక్ష్మణ్ ఎంపిక కావడంపైగ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారులకు టీ షర్ట్స్



రామడుగు: మండలంలోని గుండి గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు మంగళవారం మాజీ ఎంపీటీసీ గుండి ప్రవీణ్ టీ షర్ట్స్ అందజేశారు. కరీంనగర్‌లోని రాఘవేంద్ర వైద్యశాల డాక్టర్లు శరత్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు టీషర్ట్సను సమకూర్చారని తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి



హుజూరాబాద్: చెత్తా, చెదారం తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

హుజూరాబాద్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక అన్నారు. పట్టణంలోని ఏడో వార్డులో మంగళవారం డ్రై డే నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ఇంటి పరిసరాల్లో నిల్వ ఉన్న మురుగనీటిని, చెత్తాచెదారం పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సమ్మయ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిల్వ నీరు తొలగించాలి



చొప్పదండి: నీటిని పారబోయిస్తున్న శాంతికుమార్

చొప్పదండి: ఇళ్లలోని కూలర్లు, పాతటైర్లు ఇతర వాటిల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో మంగళవారం డ్రై డే నిర్వహించారు. ప్రతీ మంగళవారం నిల్వ నీటిని తొలగించడంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్ వడ్లూరి గంగరాజు, అంజయ్య, మల్లారపు శ్రీనివాస్, లక్ష్మణ్, వెంకటస్వామి, జానీ, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మానకొండూర్‌రూరల్: మండలంలోని లలితాపూర్, వెల్ది గ్రామాల్లో నియోజకవర్గ ఎలక్షన్ సిబ్బంది మంగళవారం ప్రజలకు ఓటుహక్కు వినియోగం, నమోదు పక్రియ, ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో బీఎల్‌వోలు శారద, పద్మజ, నోడల్ ఆఫీసర్ ఎండీ.యనీష్‌పాషా, డి.వర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న అధికారులు

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం పోలింగ్‌బూత్‌లను అధికారులు పరిశీలించారు. తాడికల్, వంకాయగూడెం, కరీంపేట, ఇప్పలపల్లి, అంబాల్‌పూర్ గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతులు, ర్యాంప్, ఆవరణలో మరుగుదొడ్లు, మూత్రశాలల వసతి ఉన్నాయా అని ఉపాధ్యాయులను తహసీల్దార్ సమ్మయ్య, ఆర్‌ఐ లక్ష్మారెడ్డి అడిగి తెలుసుకున్నారు.

ఏఎన్‌ఎంల నిరసన



పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

చిగురుమామిడి: చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం రెండవ ఏఎన్‌ఎంలు నిరసన తెలిపారు. ఈసందర్భగా మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎంలో పదిహేను సంవత్సరాలుగా కనీస వేతనానికి నోచుకోవడంలేదని, రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏ, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఆర్టీసీ కార్మికులను రెగ్యులరైజ్ చేసిన మాదిరిగానే మమ్మల్నీ పర్మినెంట్ చేయాలని కోరారు. పోస్టు కార్డు ద్వారా సీఎం కేసీఆర్‌కు సమస్యలు విన్నవించారు. నిరసనలో రెండవ ఏఎన్‌ఎంలు గాలిపెల్లి స్వరూప, పన్యాల రజిత, జెల్లి కవిత, రాజేశ్వరీ, భుక్యా స్వాతి, రొంటాల శైలజ, సరస్వతి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పోలీస్ స్టేషన్ల సందర్శన

హుజూరాబాద్ : పట్టణంలోని ఏసీపీ, టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయాను మంగళవారం ఎల్‌అండ్‌వో డీసీపీ లక్ష్మీనారాయణ సందర్శించారు. చార్జ్ తీసుకున్న మొట్టమొదటిసారిగా హుజూరాబాద్‌కు వచ్చారు.ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

◆ భూ సమస్యలు పరిష్కరిస్తాం

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల రైతులకు సంబంధించిన భూసమస్యలు న్యాయబద్ధంగా (రీజనేబుల్‌గా) ఉంటే తప్పకుండా పరిష్కరిస్తామని తహసీల్దార్ ఈ. నరేందర్ తెలిపారు. మంగళవారం చిగురుమామిడిలో మాట్లాడారు.

◆ మరమ్మతు పనులు పరిశీలన

రామడుగు: మండలంలోని మోతె శివారులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. మంగళవారం రోడ్డు మరమ్మతు పనులను చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదేశాలతో అధికారులు ప్రారంభించారు. పనులను బీఆర్‌ఎస్ మండలశాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ అమరేందర్‌రెడ్డి, నాయకులు పరిశీలించారు.

◆ వరదబాధితులకు నిత్యావసర సరుకులు

ఇల్లందకుంట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లలోకి వరదనీరు చేరిన బాధితులకు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటలరాజేందర్ ఆదేశాల మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం బియ్యం, నూనె, పప్పుదినుసులతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు బైరెడ్డి వెంకటరమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పుల రమేష్, మల్యాల, పాతర్లపల్లి గ్రామాల సర్పంచులు గురుకుంట్ల సాంబయ్య, మల్లయ్య, పవన్‌రెడ్డి, అజయ్, శ్రీపతిరెడ్డి, రాంశివ, మల్లయ్య, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

◆ అంగడిలో వసతులు కల్పించాలి

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని గొర్రె, మేకల అంగడిలో వసతులు కల్పించాలని, అమ్మకం, కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారని గొర్రెల, మేకల పెంపకదార్ల సంఘం (జీఎంపీఎస్)జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేశ్ అన్నారు. మంగళవారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాల్లోని అంగడులను సందర్శించారు. జమ్మికుంట అంగడిలో ఆదాయం ఉన్నా వసతులు కల్పించడం లేదని, అంగడికిమున్సిపాలిటీ సొంత స్థలం సమకూర్చలేదని ఆరోపించారు. నాయకులు ఐలయ్య, రవీందర్, రమేశ్ ఉన్నారు.

◆ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని చెల్పూర్‌లో ఇటీవల కురిసిన వర్షాల మూలంగా వ్యవసాయ క్షేత్రంలోని స్తంభాలు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సంబంధిత శాఖాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల విజయ్‌కుమార్ విద్యుత్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

◆ మృతుల కుటుంబాలకు పరామర్శ

ఇల్లందకుంట: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులను మంగళవారం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి బల్మూరి వెంకట్ పరామర్శించారు.

◆ టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడిగా రవి

జమ్మికుంట: టీపీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడిగా పట్టణానికి చెందిన సాయిని రవిని నియమించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియమించినట్లు మంగళవారం ప్రకటన తెలిపారు. నియామకానికి సహకరించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

హుజూరాబాద్: హుజూరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ దుర్గాభవాని మంగళవారం తెలిపారు. ఈ మేరకు కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు. రిజర్వేషన్ ప్రకారం గౌడకులస్తులకుకు నాలుగు, ఎస్సీకి ఒకటి కేటాయించామని తెలిపారు. హుజూరాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాలకు సంబంధించి 17 మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, వివరాలకు 87126 58811 సంప్రదించాలన్నారు.

◆ ఏడుగురు బైండోవర్

శంకరపట్నం: మండలంలోని ఆముదాలపల్లి గ్రామానికి చెందిన ఏడుగురిని మంగళవారం పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. భూసమస్యతో తగాదాలు రావడంతో తహసీల్దార్ సమ్మయ్య ఎదుట ప్రవేశపెట్టారు. ఒక్కొక్కరిని రూ.లక్ష పూచికత్తుతో బైండోవర్ చేస్తున్నామని, సత్ప్రవర్తనతో ఉండాలని తహసీల్దార్ సూచించారు. మళ్లీ తగాదాలు పెట్టుకుంటే జరిమానా, ఆరు మాసాల జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు.